**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 13.12.2025** **సమయం: 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్రంలో గ్రామ పంచాయితీ ఎన్నికల రెండో విడత పోలింగ్ రేపు జరుగుతుంది. 3 వేల 911 మంది సర్పంచ్ లను ఎన్నుకోవల్సి ఉంది.
2. విభజన రాజకీయాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో విజన్ ఇండియా తో పని చేస్తున్నట్టు సమాజ్ వాద్ పార్టీ అఖిలేష్ యాదవ్ చెప్పారు.
3. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఈ రాత్రి జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జట్టు, ప్రముఖ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ జట్లు తలపడతాయి.
4. రాష్ట్రంలో రేపు, ఎల్లుండి చలి తీవ్రత మరింత పెరుగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

............................................................

**పంచాయితీ ఎన్నికలు**

రాష్ట్రంలో గ్రామ పంచాయితీ ఎన్నికల రెండవ దశ పోలింగ్ రేపు జరుగుతుంది. 3 వేల 911 సర్పంచ్ పదవులకు 12 వేల 782 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే 29 వేల 913 మంది వార్డు సభ్యుల పదవులకు 71 వేల 70 మంది పోటీ పడుతున్నారు. ఈ విడతలో సుమారు 57 లక్షల 23 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవల్సి ఉంది. రేపు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమయి, మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుంది. 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపడతారు. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుంది. ఈ దశ పోలింగ్ కోసం 4 వేల 331 మంది సర్పంచ్ స్థానాలకు గాను, 415 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. కారణాంతరాల వల్ల 5 స్థానాలకు నామినేషన్లు దాఖలు

కాలేదు. అలాగే 38 వేల 332 వార్డులకు గాను 8 వేల 308 చోట్ల ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. 11 స్థానాలకు దాఖలైన నామినేషన్లు సక్రమంగా లేవు.

.... MSL - డెస్క్

**విజన్ ఇండియా సమ్మిట్:**

విభజన రాజకీయాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంగా విజన్ ఇండియాతో పని చేస్తున్నట్లు సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షులు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ చెప్పారు. సానుకూల, అభివృద్ధి, ప్రగతిశీల రాజకీయాలే తమ అభిమతమని పేర్కొన్నారు. ఈ రోజ హైదరాబాద్ లో తమ పార్టీ అధ్వర్యంలో జరిగిన విజన్ ఇండియా సమ్మిట్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, పరిపాలనలో సాంకేతికత వినియోగం, భవిష్యత్తులో సాంకేతికత పరిణామాలు లాంటి అంశాలపై యువతలో అవగాహన కల్పించేందుకు అన్ని ప్రధాన పట్టణాల్లో ఇలాంటి సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదటి సదస్సు బెంగళూరులో నిర్వహించామని, ఇది రెండో సదస్సును హైదరాబాద్ లో నిర్వహించారు. రైతు ప్రయోజనాల కోసం, మౌలిక సదుపాయాల కల్పన, పట్టణీకరణ, మెరుగైన సౌకర్యాలు కల్పనకోసం, ఆరోగ్యం, తదితర రంగాల్లో AI టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అశిలేష్ యాదవ్ పేర్కొన్నారు. వీటిపై సదస్సులో నిపుణులు పలు సూచనలు చేశారన్నారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీని నేరాలను కట్టడి చేయడానికి ఉపయోగించాలని చెప్పారు.

---MSL

**టెక్స్ టైల్**

రాజన్న సిరిసిల్లా జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని టెక్స్ టైల్ పార్క్ లో మూతపడుతున్న పరిశ్రమలను తిరిగి తెరిపించాలని తెలంగాణ మరమగ్గాల కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేశ్ కోరారు. రాష్ట్రంలోనే మొదటిగా ఏర్పాటైన ఈ పార్క్ లో కొన్నేళ్ళ క్రితం వరకు వేలాది మందికి ఉపాధి లభించేందని ప్రస్తుతం 200 మందికి కూడా పని దొరకటం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల నుంచి పరిశ్రమలను ఆహ్వానిస్తున్న

ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఇలాంటి పరిశ్రమలను పట్టించకపోవటం అని శోచనీయమని ఆయన అన్నారు. ఆయన ఈ రోజు టెక్స్ టైల్ పార్క్ ను సందర్శించారు.

..........పిటిసి, రాజన్న సిరిసిల్లా

**కాకతీయ హాజరు**

వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎల్లుండి నుంచి దశల వారీగా ముఖ గుర్తింపు హాజరును అమలు చేస్తామని విశ్వవిద్యాలయం ఆచార్య రామచంద్రం ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం, క్యాంపస్ కళాశాల, దూరవిద్యా కేంద్రం, పరీక్షల విభాగం, ఫార్మసీ, ఇంజనీరింగ్, హాస్టళ్ళ లలో ఈ విధానాన్ని ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.

.........పిటిసి, వరంగల్

**పంచాయితీ - కరీంనగర్**

రేపు జరిగే పంచాయితీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ ను పురస్కరించుకుని కరీంనగర్ పోలీసు కమీషనరేట్ పరిధిలోని 5 మండలాల్లో సెక్షన్ 163 కింద నిషేదాజ్ఞలు విధించినట్టు పోలీసు కమీషనర్ గౌస్ అలాం తెలిపారు. చిగురుమామిడి, గన్నేరువరం, తిమ్మాపూర్, మానకొండూరు, శంకరపట్నం మండలాల్లో ఐదుగురు లేదా అంతకుమించి ప్రజలు గుమికూడటం లేదా సమావేశం కావటం కాదని ఆయన హెచ్చరించారు. మానకొండూరు, తిమ్మాపూర్ మండలాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈ రోజు పరిశీలించారు.

......పిటిసి, కరీంనగర్

**రాజన్న పంచాయితీ**

రాజన్న సిరిసిల్లా జిల్లాలో బోయినపల్లి, ఇల్లంతుకుంట, తంగళ్ళపల్లి మండలాలో రేపు పంచాయితీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరుగుతుంది. 77 సర్పంచ్ స్థానాలకు, 530 వార్డు సభ్యుల పదవులకు పోలింగ్ జరుగుతుందని ఇంఛార్జ్ కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు.

**బైట్............**

.....పిటిసి, రాజన్న సిరిసిల్లా

**గోదావరి పుష్కరాలు**

గోదావరి పుష్కరాలకు ముహుర్తం ఖరారు అయినట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. 2027 జూన్ 26వ తేదీ నుంచి జూలై 7వ తేదీ వరకు పుష్కరాలు జరుగుతాయని ఆ రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి ఎమ్ హరి జవహర్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన సిద్దాంతి తంగిరాల వేంకట కృష్ణ పూర్ణ ప్రసాద్ చేసిన సూచనను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తునట్టు ఉత్తర్వులు జారీ చేసింది.

.........డెస్క్

**జనగామ పంచాయితీ**

జనగామ నియోజకవర్గంలోని జనగామ నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాలోని పంచాయితీలకు రేపు పోలింగ్ జరుగుతుంది.రేపు ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే వరకు ఊరేగింపులు, ప్రదర్శనలకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఆయన ఆకాశావాణితో మాట్లాడుతూ....

**బైట్ ............**

పిటిసి, జనగామ

**ఫుట్ బాల్**

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఈ రాత్రి జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని జట్టు, ప్రముఖ ఫుట్ బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ నాయకత్వం జట్టు తలపడతాయి. ఈ సందర్భంగా స్టేడియం పరిసర ప్రాంతాల్లో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ఈ మధ్యాహ్నం 12 గంటలకు విధించిన ట్రాఫిక్ ఆంక్షలు ఈ రాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయని దారి మళ్ళింపులు అమల్లో ఉంటాయని రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు తెలిపారు. టిక్కెట్ లేనివారు మైదానం పరిసరాలకు రావొద్దని ఆయన సూచించారు.

ఇలా ఉండగా  ఈ పోటీల పై బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈవెంట్ మేనేజర్ల వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి మెస్సీతో పుట్ బాల్ ఆడుతున్నారని విమర్శించారు. సింగరేణి వసతి గృహల బాగు చేయటానికి, సిబ్బందికి జీతాల చెల్లింపునకు డబ్బు లేదు కాని, ఇలాంటి ఆటలకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని రాజేందర్ విమర్శించారు.

.........డెస్క్

**చలిగాలులు**

ఆసిఫాబాద్ జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. ఈ ఉదయం 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత కొద్ది రోజులుగా చలి తీవ్రతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సీజనల్ వ్యాధుల పట్ల ఆసుపత్రుల సిబ్బందిని అప్రమత్తం చేశామని జిల్లా వైద్యాధికారి సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు.

........పిటిసి, ఆసిఫాబాద్

**చలి గాలులు - రాజన్న సిరిసిల్లా**

రాజన్న సిరిసిల్లా జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 8.4 డిగ్రీలుగా నమోదైందని అధికారులు తెలిపారు. చలిగాలులు పెరగటం వలన ప్రజలు ఇళ్ళకే పరిమితం అవుతున్నారు.

పిటిసి , రాజన్న సిరిసిల్లా

**ఎస్సీ ఎస్టీ పారిశ్రామిక వేత్తలు**

ఇటీవల జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో ఎస్సీ ఎస్టీ పారిశ్రామిక వేత్తలతో 580 కోట్ల రూపాయల విలువ గల అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం శుభపరిణామమని తెలంగాణ ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తల సంఘం ఛైర్మన్ పుట్టపాగ శ్రీనివాస్ అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో పుడ్ ప్రాసెసింగ్ గ్రామీణ గిడ్డంగులు, ఫార్మా కంపెనీలు, మాంసం, పండ్లు, కూరగాయల శుద్ధి వంటి కేంద్రాలు ఏర్పాటు అవుతాయని ఆయన అన్నారు.

.........డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో రేపు, ఎల్లుండి చలితీవ్రత మరింత పెరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.గత పదేళ్లలో మొదటిసారిగా ఇంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రేపు 20 జిల్లాలకు, ఎల్లుండి 12 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. కాగా ఈ ఉదయం చాలా జిల్లాల్లో 9.6 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో 5.4 డిగ్రీలు, సంగారెడ్డిలో 6.1, వికారాబాద్ లో 6.6 డిగ్రీలఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్ర తెలియజేసింది. ఆదిలాబాద్, మెదక్‌లో 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇలా ఉండగా, అనేక జిల్లాల్లో ఉదయం వేళలో మంచు కురుస్తున్నందు వాహనాచోదకుల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

...........డెస్క్

**ఖమ్మం పంచాయితీ**

ఖమ్మం జిల్లాలోని 6 మండలాల పరిధిలో 183 సర్పంచ్ పదవులకు 16 వందల 86 వార్డు సభ్యుల పదవులకు రేపు పోలింగ్ జరుగుతుంది. 28 ప్రాంతాలలో 304 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి సిసి కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసినట్టు ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తెలిపారు.

.........పిటిసి ఖమ్మం

**మహబూబా బాద్ పంచాయితీ**

మహబూబా బాద్ జిల్లాలోని 7 మండలాల పరిదిలో 146 పంచాయితీ పదవులకు రేపు పోలింగ్ జరుగుతుంది. 12వందల 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 12 వందల మంది పోలీసు సిబ్బందిని నియమించినట్టు చెప్పారు.

.........పిటిసి, మహబూబా బాద్

**సూర్యాపేట పంచాయితీ**

సూర్యాపేట జిల్లాలోని 8 మండలాల పరిదిలో 158 గ్రామపంచాయితీలకు 1460 వార్డులకు రేపు పోలింగ్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. చివ్వెంల, మోతె, నడిగూడెం, కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాలకు చెందిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఆయన ఈ రోజు సందర్శించారు. పోలింగ్ సందర్భంగా 15వందల మంది సిబ్బందితో ఐదెంచల భద్రతను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ నరసింహ చెప్పారు.

.........పిటిసి, నల్లగొండ

**జగదీశ్ రెడ్డి**

పంచాయితీ ఎన్నికల పోలింగ్ లో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందోని బిఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. తమ పార్టీ మద్దతుదారులు, గిరిజన చోట్లకు కూడా రీ కౌంటింగ్ పేరుతో ఫలితాలు తారుమారు చేసి కాంగ్రెస్ మద్దతుదారులు, గెలిచినట్లుగా చూపుతున్నారని ఆయన ఈ రోజు విలేఖరుల సమావేశంలో ఆరోపించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో బ్యాలెట్ పత్రాల వ్యవహారమే ఇందుకు నిదర్శనమని ఆయన అన్నారు.

.......పిటిసి, నల్లగొండ

**వరంగల్ పంచాయితీ**

వరంగల్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో రేపు జరిగే పంచాయితీ పోలింగ్ కోసం 18 వందల 94 మంది పోలీసులను నియోగిస్తున్నట్టు పోలీస్ కమీషనర్ తెలిపారు. పోలింగ్ జరిగే ప్రతి మండలానికి ఎసిపి హోదా అధికారి ఇంఛార్జ్ ఉంటారని తెలిపారు. పోలింగ్ విధులకు విఘాతం కల్పించేందుకు ప్రయత్నించే వారి పై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

.......పిటిసి, వరంగల్